క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నేడు సోమవారం చేవెళ్లలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. చేవెళ్లలోని కేజీ ఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల కమిటీలు, అనుబంధ కమిటీల నాయకులు అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, చేవెళ్ల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికేపూడి గాంధి, ప్రకాశ్‌గౌడ్‌లతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కమిటీ నాయకులు, తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, ముస్లింలు

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ముస్లింలు ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. ఎంతో కఠోరంగా, నియమనిష్ఠతో ఉపవాస దీక్ష చేపడతారన్నారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అందె మోహన్, ఖదీర్, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట సమీపంలోని సింగిల్ విండో కార్యాలయ గోదాంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈఓ రఘునందన్ ఆదివారం తెలిపారు. ఏడీ రాజారత్నం, ఏఓ నిషాంత్‌కుమార్ ఉదయం 11గంటలకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడు రకం క్వింటాల్ ధాన్యానికి రూ.2203, సాధారణ రకం క్వింటాల్ ధాన్యానికి రూ.2183 కనీస మద్దతు ధరను నిర్ణయించిందని పేర్కొన్నారు. అన్నదాతలు తమ ఫోన్ నెంబర్‌ను బ్యాంకు, ఆధార్ కేంద్రం, పోస్టాఫీస్, మీ సేవ కేంద్రాల్లో ఎక్కడైనా అనుసంధానం చేసుకోవచ్చని సూచించారు. ధాన్యం విక్రయించే సమయంలో ఓటీపీ నంబర్‌ను చూసుకునేందుకు మీ ఫోన్‌ను మీ వద్ద ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో ఆధార్‌కార్డు, జిల్లా కలెక్టర్ ద్వారా నియమించబడిన అధికారి ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ జిరాక్స్‌ను జత చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను అనుసరించి ధాన్యం ఎండబెట్టి పూర్తిగా శుభ్రపరిచి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని కోరారు.

షాక్ కొడుతున్న బ్రిడ్జి రేలింగ్



టెస్టర్ సాయంతో విద్యుత్ సరఫరా చెకింగ్

షాద్‌నగర్: షాద్‌నగర్ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన రేలింగ్ షాక్ కొడుతోంది. దీంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జిపై ఉన్న ఇనుప రేలింగ్‌ను పట్టుకుంటే విద్యుత్ షాక్ తగులుతోందని, టెస్టర్ సాయంతో రేలింగ్‌ను పరీక్షిస్తే అందులో విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు తెలిపారు. అయితే బ్రిడ్జిపై నుంచి హైటెన్షన్ విద్యుత్ సరఫరా అవుతుండటంతో బ్రిడ్జి రేలింగ్ షాక్‌కు వచ్చినట్లు అవుతోందని, ఇది అంత ప్రమాదకరం కాదని విద్యుత్ అధికారులు తెలిపారు.

పోలీసుల కవాతు

కందుకూరు: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ మక్బూల్‌జానీ సూచించారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని నేదునూరు, బాచుపల్లి, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి గ్రామాల్లో సీఐఎస్‌ఎఫ్ కేంద్ర సాయుధ బలగాలతో కందుకూరు పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి!

- డంపుయార్డులో తరచూ చెలరేగుతున్న మంటలు
- దుర్వాసన, పొగతో సోలీపూర్ వాసుల ఇక్కట్లు
- రోగాల బారిన జనం



సోలీపూర్ శివారులోని డంప్‌యార్డులో ఇటీవల మంటలు చెలరేగడంతో వ్యాపిస్తున్న పొగ

షాద్‌నగర్: రోడ్లపై పడేసిన చెత్త, ఇళ్లలో నుంచి సేకరించిన చెత్త మొత్తం మున్సిపల్ సిబ్బంది ఊరి చివరన పడేస్తున్నారు. చెత్త డంపు ద్వారా దుర్వాసన, తరచూ చెలరేగుతున్న మంటల ద్వారా వస్తున్న పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయని జనం వాపోతున్నారు. ఏళ్ల తరబడి డంపుయార్డు నిర్మాణం చేపట్టకపోవడం సోలీపూర్ గ్రామస్తులకు శాపంగా మారింది. త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసి డంప్‌యార్డును తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ సోలీపూర్ పరిస్థితి

మున్సిపాలిటీ పరిధిలో 28 వార్డులు ఉన్నాయి. సుమారుగా 15 వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. లక్షకుపైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రతిరోజు మున్సిపల్ సిబ్బంది సుమారు 4వేల కిలోల తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 500 కిలోల వరకు కూరగాయల వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు సుమారు 115 మంది పారిశుద్ధ్య సిబ్బంది పని చేస్తున్నారు. మున్సిపాలిటీలో రోజు రోజుకు ఇళ్ల నిర్మాణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. పట్టణం విస్తరిస్తున్నా నేటికీ డంప్‌యార్డు లేకపోవడం గమనార్హం.

స్థానికులకు శాపం

పట్టణంలో సేకరించిన చెత్త అంతా మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో పడేస్తుండడం గ్రామస్తులకు శాపంలా మారింది. ఈ డంపుయార్డు రోడ్డు పక్కన గ్రామానికి దగ్గరగా ఉండటంతో జనం అవస్థలు పడుతున్నారు. చెత్తతో ఈగలు, దోమలు విపరీతంగా వ్యాపించి స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. డంపుయార్డును ఇక్కడి నుంచి తరలించాలని ఏళ్లుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదు.

చెలరేగుతున్న మంటలు

సోలీపూర్ శివారులోని చెత్త డంపుయార్డులో తరుచుగా మంటలు చెలరేగుతున్నాయి. చెత్తకు ఎవరైనా నిప్పు పెడుతున్నారా లేక, రసాయన చర్యలతో మంటలు చెలరేగుతున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మంటలు చెలరేగినప్పుడు వచ్చే దుర్వాసనతో కూడిన పొగ గ్రామాన్ని పూర్తిగా కమ్మేస్తోంది. ఈ పొగను పీలుస్తున్న ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫలితంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

పనులు ఎప్పటికి పూర్తయ్యేనో..

చెత్త సమస్యకు స్వస్తి పలకాలని మున్సిపల్ అధికారులు, పాలక మండలి సభ్యులు చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ శివారులోని సీఎస్‌కే వెంచర్ వెనక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో డంపుయార్డు నిర్మాణానికి సుమారు రూ.12లక్షలు కేటాయించారు. ఏళ్ల తరబడిగా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు త్వరగా పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని సోలీపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు

రోగాల బారిన పడుతున్నాం



డంపుయార్డులో తరుచుగా మంటలు చెలరేగుతున్నాయి. దీంతో విపరీతమైన పొగ వ్యాపిస్తోంది. ఫలితంగా శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నాం. డంప్‌యార్డు తరలించేందుకు అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి.
– జంగయ్య, సోలీపూర్

త్వరగా పూర్తి చేయాలి



చెత్తతో విపరీతమైన దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. నూతనంగా నిర్మిస్తున్న డంప్‌యార్డు పనులు త్వరగా పూర్తి చేయాలి.
– మారుతి, సోలీపూర్

కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే

బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: కేంద్రంలో మరోసారి మోదీ సర్కారే అధికారంలోకి రాబోతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేశంలోని ప్రజలందరి మద్దతు ఉందని ప్రజలు మరోసారి మోదీ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారన్నారు. దేశాభివృద్ధి పీఎం మోదీతోనే సాధ్యమని తెలిపారు. దేశంలో అవినీతి రహిత, కుంభకోణాలు లేని పాలన అందించిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. దేశానికి మోదీ లాంటి శక్తి వంతమైన ప్రధానమంత్రి అవసరమని చెప్పారు. బీజేపీని ఓడించాలని కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్షాలు అన్ని ఏకమై బీజేపీపై దండయాత్ర చేస్తున్నాయని విమర్శించారు. కానీ దేశంలోని ప్రజలందరూ మోదీ వెనకాల ఉన్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన బీజేపీ మూడోసారి దేశంలో అధికారంలోకి రాబోతుందన్నారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకునేందుకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇక్కడ విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి మోదీకి చేవెళ్ల సీటును కానుకగా అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి ఓటు వేయాలని కోరారు.

వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్: మండలం పరిధిలోని కొలుకులపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మురుకుంట్ల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, హోమం నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బొడ్రాయికి పెద్ద ఎత్తున ప్రజలు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనురాధ, ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

చేవెళ్ల: విద్యార్థులు సమాజంలో గొప్ప వ్యక్తులుగా ఉన్నత స్థానాలకు ఎదిగినప్పుడే చదువు నేర్పిన ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణంగా ఉంటుందని హెచ్‌ఎం విశ్వనాథ్‌గుప్తా అన్నారు. మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ఆదివారం చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అంతా కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 27 సంవత్సరాల తరువాత కలిసి చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరి వారి విద్యార్థి దశను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌గుప్తా మాట్లాడుతూ.. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు వారివారి జీవితాల్లో రాణిస్తూ ఉన్నత స్థాయిలో ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శంకరయ్య, శాంత, జ్యోతిర్మయి, శశికల, పూర్వ విద్యార్థులు రంగారెడ్డి, మల్లేశ్, గోపాల్, మధు, రవికాంత్‌రెడ్డి, మంజుల, రాంరెడ్డి, రమేశ్, హాజీ, అనంత్‌రెడ్డి, మానిక్యప్రభు, శ్రీదేవి, మంజుల, అలివేలు, అరుంధతి, మణిల, లక్కి, మాధవి, ఆనంద్, మాధవ్‌రెడ్డి, గోపిచందు, రవిప్రకాశ్, చంద్రశేఖర్‌రెడ్డి, జావిద్, ఉస్మాన్, మోహన్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, వెంకటేశ్, నాగేశ్, తదితరులు ఉన్నారు.

కనుల పండువగా అశ్వవాహన సేవ



స్వామివారి ఊరేగింపులో భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి అశ్వవాహన సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పద్మనాభ చార్యులు, రామాచార్యులు వేద మంత్రాలు చదువుతుండగా వేంకటేశ్వస్వామి ఉత్సవ విగ్రహాన్ని అశ్వవాహన రథంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి కల్యాణ మండపం వరకు అశ్వవాహన సేవ కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజుకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, కృష్ణగౌడ్, ఆలయ క్లర్క్ ఆంజనేయులు, నిర్వాహకులు మధుకుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మల్లేశ్, స్వామిగౌడ్, శంకర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

చేవెళ్ల: మండలంలోని దామరగిద్ద గ్రామంలో ఆదివారం ఈస్టర్ పండగ సందర్భంగా నూతన అపోస్తులిక సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అపోస్తులిక చర్చి పాస్టర్ సిమోన్ మాట్లాడుతూ.. గుడ్ ఫ్రైడే రోజున సిలువపై అసువులు బాసిన యేసు మూడోరోజు సమాధి నుంచి భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈరోజు ఈస్టర్ పండగగా క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. క్రైస్తవులందరూ తెల్లవారు జామునుంచే సమాధి వద్ద కొవ్వత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థలు చేస్తారన్నారు. మండలంలోని అన్ని చర్చిలలో ఈస్టర్ పండగ సందడి కనిపించింది. పాస్టర్లు భక్తులకు యేసుప్రభు పునరుత్థాన గురించి వివరించారు. కార్యక్రమంలో బోడ సామేల్, పవన్‌కుమార్, రవి, డప్పు రాజు, మహేందర్, ప్రకాశ్, యోసేపు, సునీల్, మనోహర్, సాయికుమార్, ప్రభాస్, తదితరులు ఉన్నారు.

కంఠ మహేశ్వరస్వామి ఆలయంలో పూజలు



విగ్రహ ప్రతిష్ఠలో భక్తులు

ఆమనగల్లు: మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఆదివారం సురమాంబ సహిత కంఠ మహేశ్వరస్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో నవీన్‌శర్మ అర్చక బృందంతో అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి పూజ హోమం వివిధ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కార్యక్రమంలో గౌడ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వీరేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీనుగౌడ్, రవిగౌడ్, తిరుపతి, నర్సింహ, కృష్ణ, మహేశ్, బాల్‌రాజు, మహిళలు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



నిర్వాహకులతో అనితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి

కందుకూరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దెబ్బడగూడలో ఈదెమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వరికుప్పల జగన్, దేరంగుల జంగయ్య, ఆంజనేయులు, రాజు, నర్సింహ, శ్రీను, రామకృష్ణ, యాదయ్య ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణం అనంతరం బోనాలు సమర్పించారు. బలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఏనుగు శ్రావణి, జంగయ్య తదితరులు పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

వేద పాఠశాల అభివృద్ధికి సహకారం



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వేద పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ఉన్న వేద పాఠశాలకు కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య స్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేదాలు మానవజాతి గొప్ప సంపద అన్నారు. ప్రాచీన సంస్కృతిని కాపాడుతూ విద్యార్థులను వేద విద్యపై ప్రోత్సహించడం హర్షనీయమన్నారు. చిన్ననాటి నుంచి విద్యార్థులకు వేదాలపై పట్టు సాధించే విధించే శిక్షణ ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. వేద పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. వేదాల ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన సురేశ్‌కుమార్ సహకారంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, సజ్జల కాశీనాథ్, బసవేశ్వర్, భువనేశ్వర్, సంగయ్య, కొంకళ్ళ చెన్నయ్య, తిరుపతిరెడ్డి, నందు, జగదీశ్వర్, రవితేజ, మార్గం రాజేశ్, మాణిక్యం, రాఘవేందర్, రామ్మోహన్, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మార్గాలు అన్వేషించాలి

యువత స్వయం ఉపాధి మార్గాలు అన్వేషించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని రామకృష్ణ థియేటర్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాండ్ర విశాల, శ్రావణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జమృద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్తే ఇంత రాద్ధాంతమా?

- స్పందించిన నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్
- కార్యాలయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని వివరణ
- రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయదారుల ఇబ్బందులపై మౌనం

నందిగామ: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదని నందిగామ తహసీల్దార్ రాజేశ్వర్ వివరణ ఇచ్చారు. ఆదివారం సాక్షిలో 'నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని పెళ్లికి వెళ్లానన్నారు. సీలింగ్, దేవాదాయ భూముల రిజిస్ట్రేషన్లు ఇప్పటివరకు జరగలేదని, భవిష్యత్‌లో జరగవని వివరించారు. పెళ్లిలో ఉండి ఫోన్ తీయనందుకు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు.

రిజిస్ట్రేషన్లు జరిగాయా..

ఫోన్ తీయనందుకు అసత్యపు ఆరోపణ అని వివరణ ఇచ్చిన తహసీల్దార్ రాజేశ్వర్ శనివారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన విషయంపై, స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారి ఇబ్బందులపై పెదవి విప్పలేకపోవడం గమనార్హం. అంతే కాకుండా సీలింగ్ భూముల విషయంలో కూడా అక్రమాలు జరగలేదని చెప్పిన తహసీల్దారు మండల కేంద్రమైన నందిగామలో మంగలి లింగమయ్యకు చెందిన సర్వే నెం.621/3 లో 1.27 గుంటల సీలింగ్ భూమి నిబంధనలకు విరుద్ధంగా గతంలో సెల్ డీడ్(9011/2005) అయిన విషయం వెలుగులోకి రావడం, గత నెల 12న ఆ భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీని ఏ విధంగా కూల్చివేశారనే విషయాన్ని మర్చిపోవడం సరికాదన్నారు. తహసీల్దారు చెప్పినట్లు అక్రమాలే జరగకపోతే సీలింగ్ భూమి ఆర్ఓఆర్‌లో పట్టా మార్పిడి ఏ విధంగా జరిగింది. ఒక వేళ గతంలో జరిగినా కూడా ప్రస్తుతం తీసుకున్నా చర్యలు ఏమిటీ? భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీని ఎందుకు కూల్చివేశారనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకే తెలియాలి.

ఆలయాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న అశోక్, విశ్వనాథం

షాబాద్: ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని షాబాద్ ఎంపీటీసీ గుండాల అశోక్, వ్యాపారవేత్త దండు విశ్వనాథం పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి తమవంతు సాయంగా అశోక్ రూ.51వేలు, విశ్వనాథం రూ.51వేలు అందజేశారు. అనంతరం గ్రామస్తులు శాలువాతో జెడ్పీటీసీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. పురాతన ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు దోనూరు శంకరయ్య, కుమార్, తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



యజ్ఞహోమాలు నిర్వహిస్తున్న భక్తులు



విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తలకొండపల్లి: మండలంలోని చీపునుంతల గ్రామంలో సీతారామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శివ, నంది, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, సీతారామలక్ష్మణ, ఆంజనేయ, ధ్వజ, శిఖర దేవతామూర్తుల యంత్ర ప్రతిష్ఠ తదితర విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శనివారం రాత్రి జలధివాసం కార్యక్రమం నిర్వహించారు. బాజభజంత్రీలు, మంగళవాయిద్యాలు, డప్పుల చప్పుళ్లతో, వేద పండితుల మంత్రచ్ఛరణాల మధ్య ఉత్సవ విగ్రహాలను నీటిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బిందెడు శుద్ధ జలాన్ని తీసుకొచ్చి విగ్రహాలను అభిషేకించారు. ఆదివారం విశేష ధాన్యధివాసం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను నవధాన్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. ధాన్యం గింజలపైన విగ్రహాలను ఉంచి సమస్త ధాన్యం రాశులు పండే విధంగా దీవించాలని పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో యజ్ఞ హోమాలు, మూలమంత్ర జపాలు, పారాయణాలు, అభిషేకాలు, 108 మృత్తికా కలశాలతో మహాస్నాపనం, జీవ, తత్వ, ప్రాణ, కళాన్యాస, రుద్ర, పంచపుష్ప, వస్త్ర, సౌభాగ్య ద్రవ్యాధివాసాలు, హారతి, తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బత్తుల కుమార్‌గౌడ్, నరోత్తంరెడ్డి, వెంకటయ్యగౌడ్, నగేశ్, యాదయ్య, కృష్ణయ్య, గిరి, రామచంద్రయ్య, జనార్దన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి, చిన్నారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.